క్లుప్తంగా

ప్రయాణికులకు వసతులు కల్పిస్తాం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు వసతులు కల్పిస్తామని డిప్యూటీ ఆర్‌ఎం శ్రీహర్ష అన్నారు. బుధవారం ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. నూతనంగా రోడ్డు నిర్మాణం కావడంతో బస్టాండ్ ఆవరణ వరద నీరు నిండుతుంది. బస్టాండ్ ఆవరణలో వరదనీరు రాకుండా, బస్సులు తిరగడానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట కంట్రోలర్ కిషన్, సిబ్బంది ఉన్నారు.

గోరింటాకు పండుగ


గోరింటాకు పెట్టుకుంటున్న ఉపాధ్యాయులు

తలమడుగు: మండలంలోని ఉమ్రీ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆషాడ మాసం పురస్కరించుకొని విద్యార్థులు ఉపాధ్యాయులు గోరింటాకు పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల చేతులకు గోరింటాకు పెట్టుకున్నారు.

హోంగార్డుకు సన్మానం


హోంగార్డును సన్మానిస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన విష్ణుకాంత్ బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హోంగార్డు కుటుంబసభ్యుల సమక్షంలో శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. 1984లో విధుల్లో చేరిన ఈయన ఉన్నతాధికారులు ప్రశంసలు పొందారని తెలిపారు. కార్యక్రమంలో సీసీ కొండ రాజు, ఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్ కవిత, రమేశ్, సురేందర్ పాల్గొన్నారు.

అవినీతిని అరికట్టాలి

నేరడిగొండ: రేషన్ కార్డుల జారీలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా నాయకులు మజర్ అన్నారు. జిల్లా ఆదిలాబాద్ అడిషినల్ కలెక్టర్ శ్యామలాదేవిని బుధవారం జిల్లా కేంద్రంలో కలిసి వి నతిపత్రం అందజేశారు. మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న డీసీఎస్‌వోలో పెండింగ్ ఉందన్నారు. లబ్ధిదారుల నుంచి రూ.500 నుంచి రూ.5వేల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బజార్‌హత్నూర్ మండల యువజన సంఘం అధ్యక్షుడు దుబ్బు ల చంద్రశేఖర్, ప్రభాకర్, సాయి, రామ్ ఉన్నారు.

సన్మానం

జైనథ్: మండల ఎంపీడీవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మహేశ్‌కుమార్‌ను మండల బీజేపీ నాయకులు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. అనంతరం శుభాకాంక్షలు తెలియజేశారు. మండల అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రతాప్ యాదవ్, ఏనుగు రాకేశ్‌రెడ్డి, సీడం రాకేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు అందుబాటులో ఎంపీ నగేశ్

ఆదిలాబాద్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ అధిష్టానం చేపడుతున్న బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా గురువారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అందుబాటులో ఉంటారని బీజేపీ రాష్ట్ర కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ హైదరాబాదులోని రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ అందుబాటులో ఉంటారన్నారు.

డయల్ యువర్ డీఎంకు స్పందన

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన లభించింది. డిపో పరిధిలోని ప్రయాణికులు వివిధ సమస్యలను డీఎం ప్రతిమా రెడ్డి దృష్టికి తీసుకురాగా, ఆమె వాటిని నమోదు చేసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

డాక్టర్ నిర్లక్ష్యంతో శిశువు మృతి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డాక్టర్ నిర్లక్ష్యంతో శిశువు మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సొనాల మండలానికి చెందిన గర్భిణిని ఆదివారం ప్రసవం కోసం కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్పించారు. సుఖప్రసవం చేయాలని డాక్టర్‌కు సూచించినట్లు తెలిసింది. అయితే సోమవారం రాత్రి ప్రసవం కాగా, ఆ తర్వాత శిశువు మృతి చెందింది. దీంతో కుటుంబీకులు ఆస్పత్రి వైద్యులతో మాట్లాడగా అక్కడి వైద్యులు కుటుంబీకులతో దురుసుగా ప్రవర్తించారు. తర్వాత సర్దిచెప్పడంతో కుటుంబీకులు వెనుదిరిగారు. డాక్టర్ నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందినట్లు కుటుంబీకులు ఆరోపించారు.

ప్రయాణ కష్టాలు..!

- నిజామాబాద్, నిర్మల్‌కు నేరుగా లేని ఆర్టీసీ బస్సులు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు


ఉట్నూర్ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం

ఉట్నూర్‌రూరల్: అన్ని ఉండి అల్లుడి నోట్లో శని అన్న చందగా మారింది ఉట్నూర్ ఆర్టీసీ డిపో దుస్థితి. ఏదో పల్లె టూరుకు కాదు.. ఉట్నూర్ నుంచి నుంచి గుడిహత్నూర్, ఇచ్చోడ, నేరడిగొండ, నిర్మల్ మీదుగా నిజామాబాద్ జిల్లాకు నేరుగా బస్సు సౌకర్యం లేక పోవడంతో ప్రయాణికులు నానా తంటాలు పడుతున్నారు. అంతే కాకుండా కడెం, ఖానాపూర్ మీదుగా నిర్మల్ బస్సు, అదే విధంగా నేరుగా జగిత్యాల జిల్లాకు కూడా బస్సు సౌకర్యం లేక ఆయా జిల్లాలకు పనుల నిమిత్తం వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఏళ్లుగా ఇదే తంతూ..

ఎన్నో ఏళ్లుగా ఇక్కడి ప్రయాణికులు నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల ఆసుపత్రులకు వెళ్లాలన్న ఇతరత్ర పనుల నిమిత్తం అత్యవసర సమయాల్లో ఇతర ప్రాంతాలకు నేరుగా బస్సు ద్వారా వెళ్లాలనుకునే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఎలాగోలా నిర్మల్, నిజామాబాద్ చేరుకున్న మళ్లీ తిరుగు ప్రయాణంలో గుడిహత్నూర్ నుంచి బస్సులు సమయానికి దొరక్క అక్కడే ఉండిపోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రైవేటు ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందని వాపోతున్నారు.

బస్సుల్లో రద్దీతో..

ఉట్నూర్ నుంచి నేరుగా నిర్మల్, నిజామాబాద్ వెళ్లాలంటే ఉట్నూర్ నుంచి గుడిహత్నూర్ బస్టాండ్‌లో దిగి మళ్లీ నిజామాబాద్, నిర్మల్ బస్సులు ఎక్కి వెళ్లాలి. అప్పటికే ఆదిలాబాద్ నుంచి వచ్చే బస్సులు ప్రయాణికులతో రద్దీ ఉంటుంది. గంటల తరబడి వేచి చూసి రద్దీ బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. ఇట్టి విషయమై స్థానిక ప్రజాసంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు ఆర్టీసీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా.. పరిస్థితుల్లో మార్పు రావడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ఆయా జిల్లాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులకు విన్నవించాం..



ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతం నుంచి నేరుగా నిర్మల్ మీదుగా నిజామాబాద్ వరకు బస్సు సౌకర్యం లేక పోవడంతో ఇక్కడి ప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నారు. సమయానికి బస్సులు లేక నానా తంటాలు పడుతున్నారు. ఇట్టి విషయమై అనేకసార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించాం. అయినా పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేదు.

– ముజీబ్, సామాజిక కార్యకర్త

సమస్య పరిష్కారానికి కృషి

ఏఏ రూట్లలో బస్సులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారో గుర్తించి బస్సులు నడిపేందుకు కృషి చేస్తాం. తాను కొత్తగా రావడం జరిగిందని పూర్తిస్థాయిలో సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తాం. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

– భవానిప్రసాద్, ఆర్‌ఎం ఆదిలాబాద్

మంత్రిని కలిసిన బోథ్ ఎమ్మెల్యే


మంత్రి లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ/ఇచ్చోడ: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హైదరాబాద్‌లో ఆయన క్యాంప్ కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బోథ్ నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. ఆదిలాబాద్ జిల్లాలో జరుగుతున్న రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్, ప్రీతం రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శిరీష్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సాయి చైతన్య, యువ నాయకులు అభిలాష్, అజయ్ ఉన్నారు.

విద్యకు సాంకేతికత జోడించాలి


ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీ నగేశ్

బోథ్: విద్యకు సాంకేతికతను జోడిస్తే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారని ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ అన్నారు. బుధవారం కేంద్ర ప్రభుత్వానికి అనుబంధంగా ఉన్న ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ సంస్థ (ఓఎన్‌జీసీ) తమ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కార్యక్రమంలో భాగంగా బోథ్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు పొచ్చెర క్రాస్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో 100 ట్యాబ్‌లు అందజేశారు. మహిళలకు 267 కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఎంపీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. మండల విద్యాధికారి మహమ్మద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఇంద్రవెల్లి: క్షయ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు పూజిత అన్నారు. క్షయ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడితే నయం అవుతుందన్నారు. ప్రతీ నెల పోషణ కిట్, వెయ్యి రూపాయలు ఆర్థిక సాయం ప్రభుత్వం ద్వారా అందించడం జరుగుతుందన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ సురేశ్, వెంకటేశ్, వినోద్, రమేశ్, అంబారావ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఏఎంసీ చైర్మన్, ఆత్మ చైర్మన్

బోథ్: సొనాల మండల కేంద్రంలో బుధవారం ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్‌లు ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారు సిరిపురం చిన్నమ్మకు ప్రొసీడింగ్ కాపీ అందించారు. ఇందిరమ్మ పథకంలో లబ్ధిదారులకు ప్రతిఒక్కరికీ ఇంటి బిల్లులు అందుతున్నాయన్నారు. ఇంకా ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించని వారు వెంటనే ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి వెంకట రమణ, రమేశ్ బత్తుల, గాజుల పోతన్న, కసిరే పోతన్న, పోశెట్టి, ముండే శ్రీధర్, దాసు, బిల్ కలెక్టర్ అజార్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో వొకేషనల్ కోర్సులు ప్రారంభం


విద్యార్థులకు వివరిస్తున్న ఉపాధ్యాయుడు

బోథ్: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో బుధవారం వొకేషనల్ కోర్సులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు అగ్రికల్చర్ వొకేషనల్, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో, వ్యవసాయ శిక్షణలో భాగంగా సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే లాభాలు, రసాయన ఎరువుల వాడకం వల్ల వచ్చే నష్టాల గురించి వివరించారు. వర్మీ కంపోస్ట్ తయారీ, చెట్ల నాటే పద్ధతులు, జీవ ఎరువుల వినియోగం, విత్తనాల శుద్ధి వంటి అంశాలను విద్యార్థులకు ప్రాక్టికల్‌గా నేర్పించనున్నారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలో విద్యుత్ బోర్డు అమరిక, ఫ్యాన్, బోర్ మోటార్ మరమ్మతులు, మిక్సీ, గ్రైండర్, ఏసీ, కూలర్ వంటి గృహోపకరణాల మరమ్మతులపై విద్యార్థులకు ప్రాథమిక శిక్షణ ఇవ్వనున్నట్లు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పేర్కొన్నారు.

జీవో 49 రద్దు చేయాలి


మాట్లాడుతున్న రవికుమార్

ఉట్నూర్‌రూరల్: కుమురం భీం జిల్లా టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ఫారెస్టు ఏర్పాటును విరమించుకోవాలని, జీవో 49 రద్దు చేయాలని ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కోకన్వీనర్ బండా రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఉట్నూర్ హెచ్‌కేజీఎన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధికారులు గ్రామసభలు నిర్వహించకుండా, ప్రజాభిప్రాయ సేకరణ తీసుకోకుండా, పీసా చట్టం అమలు చేయకుండా జీవో తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. అటవీ శాఖ ఇప్పటికే ఆదివాసీ గ్రామాలకు ఐటీడీఏ ద్వారా మంజూరైన బోర్లు, త్రీఫేజ్ కరెంటు, రహదారులను గ్రామాల్లో వేయనీయకుండా అడ్డుపడుతున్నారని అన్నారు. ప్రభుత్వ పథకాలు అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు భూపాల్, రవీందర్, ఆశయ్య, మల్లేశ రాజన్న, సచిన్, శంబు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్


డాక్టరేట్ పట్టా అందుకున్న ప్రిన్సిపాల్ సంగీత

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న సంగీత రాథోడ్‌కు డాక్టరేట్ పట్టా పొందారు. హైదరాబాద్‌లో బుధవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ చేతుల మీదుగా పట్టాను అందుకున్నారు. నిజామాబాద్ జిల్లా డిచ్పల్లిలోని తెలంగాణ విశ్వ విద్యాలయం నిర్వహించిన రెండో కన్వర్గేషన్ కార్యక్రమంలో ఈ ఘనత సాధించారు. పీహెచ్‌డీ మొదటి బ్యాచ్‌లో సీటు పొందిన ఆమె ప్రొఫెసర్ లావణ్య పర్యవేక్షణలో ఆదిలాబాద్ గిరిజనుల సంస్కృతి, మౌఖిక సాహిత్యం అనే అంశంపై పరిశోధన చేశారు. ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్ లభించడంపై కళాశాల లెక్చరర్లు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సీఆర్టీ డెమో కార్యక్రమానికి నిరసన సెగ


మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గతంలో సీఆర్టీ పోస్టులకు పరీక్షలు రాసిన అభ్యర్థులకు ఎంపిక కోసం బుధవారం ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఆదేశాల మేరకు అధికారులు ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లోని పీఎంఆర్సీలో డెమో పరీక్షలు నిర్వహించారు. ఎంపిక కోసం నిర్వహించిన డెమో పరీక్షల్లో పాత అభ్యర్థులకు పిలిచి, మెరిట్ ఉన్న వారికి ఆహ్వానించలేదని సీఆర్టీల సంఘం నాయకులు సీఆర్టీలు డెమో క్లాసు నిర్వహిస్తున్న భవనం ముందు నిరసన వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న పీవో నిరసన తెలుపుతున్న సంఘ నాయకులకు నచ్చ చెప్పారు. నిబంధనల ప్రకారమే ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు.

రిజర్వేషన్ ఆర్డినెన్స్‌పై సంబురాలు


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బేల: మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఆర్డినెన్స్‌పై మండల కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సవాపురే విలాస్, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, ఫైజుల్లాఖాన్, సామ రూపేష్‌రెడ్డి, సుధాంరెడ్డి, వాంఖడే వామన్, బొక్రే శంకర్, గోడే అవినాష్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం నిల్వ చేసిన వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన షేక్ అస్లమ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. జూన్ 25న కేసు నమోదు చేయగా, పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. బుధవారం నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

రిమ్స్ డైరెక్టర్‌కు వినతి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు జూన్ నెల వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ సంఘం మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. బుధవారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. రిమ్స్‌లో పనిచేసే పారిశుధ్య కార్మికులు, పేషెంట్‌కేర్‌లకు వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారు. తమకు రావాల్సిన వేతనం చెల్లించాలని కోరారు. నాయకులు చందు, రమేశ్, ముజీబ్, ఖాసిమ్, సంగీత, డేవిడ్ పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు సాగు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: రైతులు పండ్ల మొక్కల సాగు చేయాలని ఉత్తర తెలంగాణ జోనల్ హెడ్ బి.మహేందర్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని కొండలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయ పరిశోధన స్థానంలో షెడ్యూల్డ్ కులాల రైతులకు శిక్షణ, మొక్కల పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. 150 మంది రైతులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మురళి, అల్లైక్య, దేవిదాస్, శివరాజ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

జైనథ్ : ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఎంపీడీవో మహేశ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామంలోని దుకాణదారులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ గ్లాసులు, క్యారీ బ్యాగులు, వాటర్ ప్యాకెట్లు, ఇలా అనేక వస్తువులను వాడుతున్నట్లయితే క్యాన్సర్‌కు దారి తీసే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ లంక నర్సింగ్ రావు, పంచాయతీ సెక్రెటరీ మోజీబ్ ఖాన్, దుకాణదారులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సమస్యలు లేకుండా చూడాలి


వంట గదిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఇంద్రవెల్లి: వసతి గృహంలో ఉంటూ చదువుతున్న విద్యార్థినులకు ఎలాంటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. బుధవారం మండలంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహానికి ప్రహరీ లేక ఇబ్బంది పడుతున్నామని వివరించారు. వంట గదిని పరిశీలించి, మెనూ పాటించాలని సిబ్బందికి సూచించారు. చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ఏమాయికుంట శివరంలో ప్రధాన రహదారి వద్ద ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్ స్థలంను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను కొనసాగించాలని ధర్నా


విద్యార్థులతో కలిసి ధర్నా చేస్తున్న గ్రామస్తులు

తలమడుగు: మండలంలోని కజ్జర్ల ప్రాథమిక పాఠశాలలోని ముగ్గురు ఉపాధ్యాయులను సర్దుబాటు పేరుతో ఇక్కడే కొనసాగించాలని బుధవారం కజ్జర్ల గ్రామస్తులు విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. పాఠశాలలో దాదాపు 100 మంది విద్యార్థులు, ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ఉపాధ్యాయుల సహకారంతో ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాల నడుస్తుందన్నారు. ఈ క్రమంలో అధికారులు సర్దుబాటు పేరుతో ముగ్గురు ఉపాధ్యాయులను ఇతర పాఠశాల పంపడం ఎంతవరకు సమంజసమని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులను కజ్జర్ల పాఠశాలలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేదంటే పాఠశాలలో నుంచి విద్యార్థులు టీసీలు తీసుకొని ఇతర పాఠశాలకు వెళ్లడం జరుగుతందన్నారు. గ్రామపెద్దలు చింతలపల్లి దేవారెడ్డి, మొట్టి కిరణ్ కుమార్, కిష్టమ్మ, అగ్గిమల గణేష్, గంగన్న, శివారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య


మౌనిష్ రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సాత్నాల: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రముఖ సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి అన్నారు. భోరజ్ మండలం మాండగడ గ్రామంలో బుధవారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చేయూత కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్, అంగన్‌వాడీ పిల్లలకు పలకలు పంపిణీ చేశారు. ఇటీవల ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన వాగాడే అమృతని సత్కరించారు. మండల విద్యాధికారి శ్రీనివాస్, ప్రధాన ఉపాధ్యాయురాలు అర్చన, రవి, అర్చన, మచ్చేందర్, సంతోష్, సునంద, మాజీ సర్పంచులు నర్రా నాందేవ్, మహేందర్ రావు పాల్గొన్నారు

కొత్త నాయకుల పెత్తనమేందీ?

- సమావేశాలకు సమాచారం ఇవ్వడం లేదని ఆందోళన

బోథ్: కష్టపడి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తే.. కొత్తగా ఇతర పార్టీల నుంచి వచ్చే నాయకుల పెత్తమేందని బీజేపీ నాయకులు ఎంపీ నగేశ్ ఎదుటే ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పాత , కొత్త నాయకుల మధ్య విబేధాలు తారాస్థాయికి చేరాయి. బుధవారం బోథ్ మండలంలోని పొచ్చెర క్రాస్ రోడ్డు వద్ద గల ఓ ఫంక్షన్ హాల్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లు, మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సమాచారం తమకు ఇవ్వలేదని పాత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీకోసం కష్టపడితే పట్టించుకునే నాయకులే లేరని బీజేవైఎం జిల్లా కార్యదర్శి మానాల శేఖర్, కట్ట భూమేష్, శ్రీకాంత్ మండిపడ్డారు. దీంతో ఎంపీ నగేశ్ కలుగజేసుకొని పార్టీలో ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందన్నారు.